క్లుప్తంగా

చారిత్రాత్మక కట్టడాలు పరిరక్షించుకుందాం

తగరపువలస: ప్రపంచ వ్యాప్తంగా చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. అంతర్జాతీయ చారిత్రాత్మక కట్టడాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కలిగించారు. ప్రపంచ వ్యాప్తంగా 800 పురాతన కట్టడాలు, స్థలాలను పరిరక్షించుకుంటున్నామన్నారు. మనదేశంలో ఆగ్రా కోట, అజంతా, ఎల్లోరా గుహలు, తాజ్‌మహల్, కోణార్క్ సూర్యదేవాలయం, మహాబలిపురం, గోవా చర్చి, ఫతేపూర్ సిక్రీ, హంపి, ఖజరహో కట్టడాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు ఎన్.రమేష్, పి.నాగమణి, బి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో సిబ్బంది

కొమ్మాది: ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రశాయన శాస్త్ర విభాగం విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగం నుంచి ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ కోర్సులు అభ్యసిస్తున్న 120 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. వారందరినీ మంగళవారం ఆయన అభినందించారు.

16వ బెటాలియన్ కమాండెంట్‌కు ఘన వీడ్కోలు



డీఐజీ ప్రవీణ్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న బెటాలియన్ అధికారులు

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డు పరిధి బక్కన్నపాలెంలో గల ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తూ డీఐజీ హోదాలో నగరంలోని గ్రేహౌండ్స్ డిపార్టుమెంట్‌కు బదిలీపై వెళ్తున్న డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ దంపతులను సోమవారం రాత్రి బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఐజీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అధికారుల ఆదేశాలను పాటిస్తూ ఉత్తమ బెటాలియన్‌గా తీర్చిదిద్దేందుకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు శామ్యూల్ జాన్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బోయిపాలెంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్

ఆనందపురం : మండలంలోని బోయిపాలెం జంక్షన్‌లో మంగళవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత ముందుకు వచ్చి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసుల సేవలను గుర్తిస్తూ ఆటో యూనియన్ ప్రతినిధులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తారకేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

తగరపువలస: వివిధ సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో లోపాలు సవరించి, శతశాతం సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన స్థానికులతో మాట్లాడారు. గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ల దృష్టికి ప్రజలు తీసుకొచ్చే సమస్యలు నూరుశాతం పరిష్కరించడానికే ఈ కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి నివాసితులతో 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, దంతులూరి వాసురాజు, గాడు వెంకటప్పడు, బోని బంగారునాయుడు, శిరుగిడి ఈశ్వరరావు, భాగం సుధాకర్, పొట్నూరు చంద్రశేఖర్, గాడు తాతినాయుడు, మద్దిల పాపారావు, ముదరగడ్డ శ్రీను, కొట్యాడ శ్రీను, మేడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాల అమలు

కొమ్మాది: పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు పాత పరదేశిపాలెంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటిస్తూ కరపత్రాలు అందజేశారు.



తాటితూరు పంచాయతీ కనకలపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో మంగళవారం రాత్రి జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ పాలనలో తేడాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ క్యాలెండర్లు, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో బాందేవుపురం కో - ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పేరుతో వివిధ సచివాలయాల పరిధిలో గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా చేస్తున్న సర్వేకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. కన్వీనర్లు అడిగిన ప్రశ్నలకు లబ్ధిదారులు తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెబుతున్నారు. చంద్రబాబు పాలనలో సంక్షేమం పేరుతో మోసపోయామంటున్నారు. మంగళవారం భీమిలి మండలంలోని నారాయణరాజుపేట, పెద నాగమయ్యపాలెం, చిప్పాడ, లక్ష్మీపురం పంచాయతీలతోపాటు జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేటలో సర్వే చేవారు. కార్యక్రమాల్లో పాతపాలెం నుంచి బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, చేట్ల శ్రీనివాస రెడ్డి, ఒకటో వార్డు సంతపేటలో చిప్పాడ వెంకటేష్, చిల్ల ప్రమీల, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు



పాతపాలెంలో సర్వేలో కన్వీనర్లు, గృహసారథులు



సంతపేటలో సర్వేలో కన్వీనర్లు, గృహసారథులు

ఘనంగా గ్రామ దేవతల పండగలు





మూగధారమ్మ అమ్మవారు, రుషికొండలో ఉత్సవాలు

కొమ్మాది: తీర ప్రాంతంలోని ఊరూరా గ్రామ దేవతల పండగలు ఘనంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పాత పరదేశిపాలెం గ్రామదేవత మూగధారమ్మ అమ్మవారు మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా చేపలుప్పాడ, ఎస్సీ కాలనీ గ్రామదేవత పరదేశమ్మ తల్లి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 8వ వార్డు రుషికొండలో గల పోలమాంబ అమ్మవారి మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన నేల వేషాలు, పగటి వేషాలు ఆకట్టుకున్నాయి.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

పద్మనాభం: వేసవి రెండు నెలలూ మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకూడదని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో మంగళవారం తాగునీటిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బోరు బావులు, పైప్‌లైన్ల మరమ్మతులు తక్షణమే చేయించాలన్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి సర్పంచ్‌లు, అధికారులు కృషి చేయాలన్నారు. తాగు నీటికి సంబంధించి మేజర్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే... ప్రత్యేక నిధులు ఎమ్మెల్యే నుంచి తీసుకొస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఈవోఆర్డీ ఎం.ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

ఆనందపురం : నిత్యావసర సరకుల ధరలు నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు రవ్వ నరసింగరావు చెప్పారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆనందపురం జంక్షన్, వేములవలస బీసీ కాలనీలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి చూస్తోందని, అన్ని వర్గాల వారు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్యాస్, పెట్రోల్, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఈ నెల 26న సమస్యల పరిష్కారం కోసం స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద భారీ సభ నిర్వహించనున్నామని, అన్ని వర్గాలు వారు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. ఐద్వా నాయకురాలు కె.నాగరాణి, సీఐటీయూ మండల కార్యదర్శి డి.రమణ, ఎన్.రామారావు, మార్కెట్ కళాసీలు పాల్గొన్నారు.



ఆనందపురంలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

మధురవాడ : ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తున్న బీజేపీని ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఆ పార్టీలు నిర్వహిస్తున్న ప్రచారోద్యమ యాత్రలో భాగంగా మంగళవారం జీవీఎంసీ 7వ వార్డులోని రిక్షా కాలనీ, శ్రీనివాసనగర్, బాపూజీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని పోరాటాలు చేస్తుంటే బీజేపీ మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఎన్‌టీఎస్‌లో 120 మందికి గోల్డ్ మెడల్స్

మధురవాడ: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో బక్కన్నపాలెం రోడ్డులో గల మధురవాడ బ్రాంచి శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల నిర్వహించిన ద్వితీయ స్థాయి పరీక్షలకు 397మంది హాజరుకాగా 120మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ పరీక్షల్లో మొదటి బహుమతి సాధించిన డి.వైష్ణవి, జె.నిక్షితలకు ట్యాబ్స్ అందజేశారు. ఇతర విద్యార్థులకు విద్యా సంస్థల ఆర్ఐవో అహ్మద్ అలీ చేతుల మీదుగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్, ఉత్తరాంధ్ర ఏజీఎమ్ సురేష్, విశాఖ జోన్ కో ఆర్డినేటర్ రాజేష్, ఒలంపియాడ్ ఇన్‌చార్జ్‌లు నీలిమ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఎస్‌లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చెత్త సేకరణపై అవగాహన అవసరం



ఇడదాసరిపేటలో మాట్లాడుతున్న జెడ్పీ రాము

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఇడదాసరిపేటలో స్థానిక మహిళలకు తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త సేకరణపై జెడ్పీ బొడ్డేపల్లి రాము మంగళవారం అవగాహన కలిగించారు. ప్రతి సచివాలయం పరిధిలో ఇంటి ముందుకు వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను విభజించి అందించాలని సూచించారు. చెత్తను ఎట్టి పరిస్థితులలోనూ డ్రైనేజీలు, రోడ్లపై వేయకుండా కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, నమ్మి లక్ష్మణరావు, శీరపు నరసింహారెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ బాగుండాలని 'గడప గడపకు'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: అందరూ బాగుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో రాష్ట్ర వ్యాప్తంగా ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన కనకలపేట, శిరిగుడి వారి కళ్లాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కరించడానికే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎండనకా, వాననకా అధికారులతో కలిసి ప్రజల మధ్య తిరుగుతూ అక్కడికక్కడ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. గతంలో భీమిలి నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రజల మధ్యకు రాలేదని, వచ్చినా కార్లు దిగకుండానే వెళ్లిపోయారన్నారు. పంచాయతీలో రూ.1.76 కోట్లతో అభివృద్ధి పథకాలు, రూ.9.92 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సీఎం జగన్ చేసిన మేలును ప్రజలు మరచిపోవద్దన్నారు. అలాగే పంచాయతీ ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీపీ ఎం.వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతలూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, దుంపల నాగమణి, పల్లంటి శ్యామ్‌సుందరరావు, చిల్ల కృష్ణారెడ్డి, మద్దిల గురునాయుడు, రవ్వ ఈశ్వరరావు, సింగిడి అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జీవీ నారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, పొట్నూరు చంద్రశేఖర్, శిరుగిడి ఈశ్వరరావు, దుంపల ప్రభాకర్, చెల్లూరి నగేష్, చిల్ల హరి, పల్లా సన్యాసిరావు, ఉండబట్ల చిన్నారావు, కొయ్య రమేష్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



తాటితూరు పంచాయతీలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొత్త భవనంలోకి ఆయుర్వేద ఆస్పత్రి

పద్మనాభం: మండలంలోని రేవిడి ఆయుర్వేద ఆస్పత్రిని కొత్త భవనంలోకి మంగళవారం తరలించారు. దీంతో ఆయుర్వేద ఆస్పత్రికి సొంత భవనం సమకూరింది. గతంలో శిథిలావస్థలో ఉన్న ఏఎస్ఎం క్వార్టర్స్‌లో సిబ్బంది విధులు నిర్వహించేవారు. అది వర్షాలకు కారిపోతుండడంతో ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలతో పీహెచ్‌సీ కార్యాలయాన్ని ఆధునికీకరించారు. దీనికి అనుసంధానంగా ఆయుర్వేద ఆస్పత్రి కోసం ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించారు. ఈ గదిలోకి ఆయుర్వేద వైద్యశాలను మార్చారు. ఇక్కడ దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, అలెర్జీకి మందులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి ఎస్.లక్ష్మీ సౌజన్య తెలిపారు. ప్రజలు ఆయుర్వేద ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



విధులు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి

మత సామరస్యం పెంపొందించేందుకు కృషి



ముస్లిం కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక



ఆనందపురం మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : సమాజంలో మత సామరస్యాన్ని పెంపొందించడానికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. వేములవలస పూల మార్కెట్ వద్ద ఉన్న మసీదులో మంగళవారం రంజాన్ సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం దేశంలో అన్ని మతాలకు సమాన గౌరవం కల్పించిందన్నారు. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తన సంపాదనలో కొంత భాగాన్ని పేదల అభ్యున్నతి కోసం వినియోగించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా మండలంలో గల ముస్లింల కోసం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరగా తొందరలో స్థల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు బర్కత్ అలీ, ఫరూఖ్, ఎండీ హసీమ్, అలీ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పాండ్రింకి శ్రీను, బొట్ట రామకృష్ణ, లొడగల రమణ, పిన్నింటి రమణ, కాకర రమణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కాలనీలో ఇఫ్తార్ విందు

పీఎం పాలెం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పీఎం పాలెంలోని ముస్లిం కాలనీలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఆహార పదార్థాలు వడ్డించారు.

అనంతరం స్థానిక మసీదులో ముస్లిం పెద్దలతో మాట్లాడారు. ముస్లింల కోసం కేటాయించిన శ్మశాన వాటిక స్థలంలో సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, సియాద్రి కనకరాజు, భాస్కరరావు, ఉస్మానియా కాలనీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, మైనారిటీ సెల్ వార్డు అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ పాల్గొన్నారు.

ఎల్లారమ్మ ఆలయంలో అన్నదానం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామదేవత తగరపువలస ఎల్లారమ్మ ఆలయంలో మంగళవారం కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీరామ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం జరిపే ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఎల్లారమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, శ్రీరామ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న శ్రీరామ యువజన సేవా సంఘం ప్రతినిధులు

అగ్ని ప్రమాదంలో కోళ్ల ఫారం దగ్ధం

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ ఈగలవానిపాలెంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో కోళ్ల ఫారం పాకలు కాలిపోయి సుమారు రూ.లక్షన్నర ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు. ఈగల అప్పలరాజు అనే వ్యక్తి కమ్మల పాకల్లో కోళ్ల ఫారాలను నడుపుతున్నాడు. ఇటీవలే అందులో గల కోళ్లను తీసివేయగా పాకలు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం కోళ్ల ఫారం పాకలపై నుంచి ఉన్న విద్యుత్ తీగలపై కొబ్బరి మట్టలు పడడంతో మంటలు చెలరేగి కాలిపోయాయి. తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది శకటంతో వచ్చి మంటలు మరింత వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కిషోర్‌కు నివాళి



కిషోర్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రంగూరి కిషోర్‌కుమార్ అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించారు. రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చిట్టివలసలో కిషోర్ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి పెదనాన్న ప్రసాద్ కుమారుడు కిషోర్‌కుమార్. ప్రసాద్ గతంలో భీమిలి మున్సిపాల్టీ కౌన్సిలర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ తన మామగారైన రంగూరి సీతారామదొర, మృతుని సోదరుడు గిరిధర్, భార్య గాయత్రి, పిల్లలను పరామర్శించారు.

ఆకట్టుకున్న 'షేడ్స్ ఆఫ్ వైజాగ్'

బీచ్‌రోడ్డు: మన సాంప్రదాయలు, సాంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటిష్ వారి అరాచక పాలనను చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. ఆర్టిస్ట్ నరేష్ మెహతా వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతమన్నారు. ఈ ప్రదర్శన బుధ, గురువారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో హవామహల్ రాజమాత మయంక్ కుమారి దేవి తదితరులు పాల్గొన్నారు.